# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-01-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలోని పట్టణాలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో అన్ని విధాల అభివృద్ధి చేస్తామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు

2. ఆరోగ్య సంరక్షణ ప్రతి పౌరుడికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

3. రాష్ట్రంలో సంవత్సరం వరకు విద్యుత్ ఛార్జీల పెంపు ఉండదని విద్యుత్తు నియంత్రణ మండలి వెల్లడించింది.

4. విద్యుత్ వాహనాలను కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి పూర్తిస్థాయిలో పన్ను రాయితీని కల్పిస్తున్నామని ప్రభుత్వం తెలిపింది.

5. సంక్రాంతి రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది.

==========================

భూగర్భ త్రవ్వకాలు అధికంగా జరిగే అరకు , పాడేరు వంటి మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృష్ణా జిల్లా తాడిగడపలో రెండు ఆరోగ్య రథం వాహనాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు కోట్ల రూపాయల వ్యయంతో పూర్తిస్థాయిలో ఆధునిక సాంకేతికత సిబ్బందితో కూడిన వాహనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. వీటి ద్వారా మారుమూల ప్రాంతాలలోని ఆరోగ్యానికి సంబంధించిన అన్ని పరీక్షలు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు

--------------------------

రాష్ట్రంలోని పట్టణాలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో అన్ని విధాల అభివృద్ధి చేస్తామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని వివిధ ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ఆయన ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడతూ, రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థలలోని కాలువల్లో పూడికను తీసేందుకు 50 కోట్ల రూపాయలను కేటాయించామన్నారు. నగరాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పూర్తి వివరాలతో ప్రాజెక్టు నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ( 33 సెకన్లు)

---------------------------

ఆరోగ్య సంరక్షణ ప్రతి పౌరుడికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వైద్యాధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ఆరోగ్యశాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, ఆసుపత్రుల్లో సేవల మెరుగుదలకు తీసుకున్న చర్యలపై ప్రతి నెలా నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రుల్లో విభాగాల వారీగా ప్రభుత్వం మంజూరు చేసిన ఉద్యోగాలను ప్రాధాన్యత క్రమంలో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

విద్యుత్ డిస్కంల ఆర్థిక లోటును ప్రభుత్వం భరించనుందని, ఈ నేపథ్యంలో ఏడాది వరకు ఛార్జీల పెంపు ఉండదని రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి ఛైర్మన్ ఠాకూర్ రాంసింగ్ వెల్లడించారు. కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదాయ అవసరాలు, ప్రతిపాదిత టారిఫ్‌ల దాఖలుపై బహిరంగ ప్రజాభిప్రాయసేకరణ పూర్తి చేశామన్నారు. డిస్కంల రెవెన్యూ లోటు భరించేందుకు ప్రభుత్వం సంసిద్ధత తెలిపిందని ఆయన తెలుపుతూ,

వాయిస్ ( 35 సెకన్లు)

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులోకి తెచ్చే 150 రకాల సేవల సమాచారం తెలుగు, ఆంగ్ల భాషల్లో ఉండేలా చూడాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో రియల్ టైం గవర్నెన్స్- ఆర్టీజీఎస్ కేంద్రాన్ని నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వంలోని ప్రతి శాఖతోనూ ఆర్టీజీఎస్ సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు పనితీరును మెరుగుపరచుకునేందుకు వీలుగా సాంకేతిక సహకారాన్ని అందించాలన్నారు. పౌరుల సేవలకు సంబంధించి ఆయా శాఖలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటికి సాంకేతిక పరిష్కారాలను చూపడంలో ఆర్టీజీఎస్ కీలకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

---------------------------

సంక్రాంతి రద్దీ దృష్ట్యా 188 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి శ్రీధర్ వెల్లడించారు. హైదరాబాద్ లో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రయాణీకుల సౌకర్యర్థం 16 జన సాధారణ రైళ్లు కూడా అందుబాటులో ఉంటాయని చెప్పారు. చర్లపల్లితో పాటు సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ నుంచి కూడా రెండు తెలుగు రాష్ట్రాలకు రైళ్లు నడుస్తాయని శ్రీధర్ తెలియజేస్తూ,

వాయిస్... 35 సెకన్లు

---------------------------

సంక్రాంతికి సొంత ఊళ్ళకు వెళ్లే ప్రయాణికులతో ఈ రోజు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. హైదరాబాద్ లోని అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి కొత్తగూడెం వరకు వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. చౌటుప్పల్ పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. సిబ్బంది 10 టోల్‌బూత్‌ల

ద్వారా ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తున్న వారిని తరలిస్తున్నారు. అలాగే ఎన్టీఆర్ జిల్లాలోని కీసర టోల్‌ప్లాజా వద్ద రద్దీ నెలకొంది. విజయవాడ వైపు వెళ్లే కార్లు, ఇతర వాహనాలతో నందిగామ వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ పెరిగింది. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టారు.

---------------------------

రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ నాటు సారా తయారీ రహిత రాష్ట్రంగా మార్చేందుకు నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ఐదు నెలల వ్యవధిలో దీన్ని సాధించాలని తెలుపుతూ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు నెలల పాటు నాటు సారా తయారీ విక్రయాలకు దూరంగా ఉన్న వాటిని నాటు సారా రహిత గ్రామాలుగా ప్రకటిస్తామని తెలిపారు. ఈ గ్రామాలు తిరిగి పాత విధానాలు కొనసాగించకుండా ప్రభుత్వ పర్యవేక్షణలో ఉండనున్నాయని వెల్లడించారు. అలాగే నాటు సారా తయారీ గ్రామాలను సందర్శించి సమన్వయ కమిటీల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తారని ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 33 సెకన్లు....

---------------------------

రాష్ట్రంలో పర్యావరణహితంగా ఉండే విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేలా వాటిని కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి పూర్తిస్థాయిలో పన్ను రాయితీని కల్పిస్తున్నామని రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే తెలిపారు. ఈ మేరకు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సస్టైనబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0 అమలులో భాగంగా 2024-29 సంవత్సరం మధ్య కొనుగొలు చేసే విద్యుత్ వాహనాలకు మోటార్ వాహన పన్ను మినహాయింపు వర్తిస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు హైబ్రిడ్ నాలుగు చక్రాల వాహనాలకు మాత్రం ఇది వర్తించదని ఆ ఉత్తర్వుల్లో తెలిపారు.

======================